నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, బుధవారం 17 ఏప్రిల్ 2024 | KHAMMAM

అసమర్థ కాంగ్రెస్‌ను ఎండగడదాం..

- ఆ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్న కసితో ప్రజలు సిద్ధంగా ఉన్నారు
- జిల్లాలో ప్రతి ఇంటికీ వెళ్దాం.. అన్ని వర్గాల ప్రజలనూ కలుద్దాం..
- కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని, కేసీఆర్ చేసిన అభివృద్ధిని వివరిద్దాం..
- కార్యకర్తలే బీఆర్ఎస్ సారథులు.. వారిపై ఈగ వాలినా సహించం..
- ఎంపీ నామా, మాజీ మంత్రి పువ్వాడ, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు
- ఖమ్మంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం



బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నామా, మాజీ మంత్రి పువ్వాడ, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, మేయర్ నీరజ, కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్‌కుమార్

ఖమ్మం, ఏప్రిల్ 16 : అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ ఎండగడదామని, తరిమికొడదామని ఖమ్మం ఎంపీ, బీఆర్ఎస్ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన ఆ ప్రభుత్వం.. ఆ తరువాత వాటికి తిలోదకాలిచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఖమ్మంలోని మమత ఆస్పత్రి ప్రాంగణంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు అధ్యక్షతన మంగళవారం జరిగిన పార్టీ ఖమ్మం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృత ప్రచారం సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ చెప్పిన మాయమాటలను, ఆ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలు గమనించారని అన్నారు. అందుకే ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలన్న కసితో ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా సమరోత్సాహంతో పని చేయాలని, ప్రజాక్షేత్రంలో సుశిక్షితులైన సైనికుల్లా కదనరంగంలోకి దిగాలని పిలుపునిచ్చారు. అలాగే, పార్టీ శ్రేణులు జిల్లాలోని ప్రతి ఇంటికీ వెళ్లాలని, అన్ని వర్గాల ప్రజలనూ కలవాలని సూచించారు. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని, గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలే పార్టీ రథసారథులని, వారి కృషి వల్లనే తాము ఈ స్థాయికి చేరుకోగలిగామని అన్నారు. కార్యకర్తలపై ఈగ వాలినా సహించేదిలేదని స్పష్టం చేశారు. అధికారం లేకపోయినా శ్రేణులకు అండగా ఉంటామని, కష్టకాలంలో వారిని ఆదుకుంటామని ధైర్యం చెప్పారు. ప్రస్తుత సమయంలో తెలంగాణ గొంతును పార్లమెంటులో వినిపించేందుకు బీఆర్ఎస్ ఎంపీలు గెలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు.

నిశ్శబ్దాన్ని వీడి ప్రజాక్షేత్రంలోకి వెళ్దాం: అజయ్

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇక నిశ్శబ్దాన్ని వీడి ప్రజాక్షేత్రంలోకి వెళ్దామని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయం కోసం కలిసికట్టుగా శ్రమిద్దామని అన్నారు. స్వార్థంతో కొందరు పార్టీని వీడిపోయినా మనమందరమూ ఐక్యంగా ఉన్నామని, కష్టకాలంలో పార్టీ అధినేత కేసీఆర్‌కు అండగా నిలబడ్డామని అన్నారు. అందుకని అందరమూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థి నామా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామని, కేసీఆర్‌కు మద్దతుగా నిలుద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దిన కేసీఆర్‌ను దూరం చేసుకున్నందుకు ప్రజలు కూడా ఎంతో బాధపడుతున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ఎదురుచూస్తున్నారని అన్నారు.

కేసులకు భయపడేది లేదు: వద్దిరాజు

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. పార్టీ నాయకులు, కార్యకర్తలపై అధికార పార్టీ పెట్టే కేసులకు భయపడే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. అలాగే, కేసీఆర్‌ను దూరం చేసుకున్నందుకు ప్రజలు కూడా బాధపడుతున్నారని అన్నారు. అందరమూ కలిసి ఐక్యంగా పనిచేసి నామా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఖమ్మంలో నామా గెలిస్తే కేసీఆర్ ఎంతగానో సంతోషిస్తారని, మనకూ మంచి గౌరవం దక్కుతుందని అన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు పునుకొల్లు నీరజ, కూరాకుల నాగభూషణం, ఆర్జేసీ కృష్ణ, కర్నాటి కృష్ణ బచ్చు విజయ్‌కుమార్, ఖమర్, తాళ్లూరి జీవన్, మోతారపు సుధాకర్, వీరూనాయక్, కూరాకుల వలరాజు, పసుమర్తి రామ్మోహన్‌రావు, రుద్రగాని శ్రీదేవి, జ్యోతిరెడ్డి, గాదె అమృత, ప్రసన్న, నాగండ్ల జ్యోతి, డోలే లక్ష్మి, సరిపూడి సతీశ్, రుద్ర ప్రదీప్, తోట ఉమారాణి, జశ్వంత్, రవి, మాటేటి అరుణ, ధనాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నామా, వద్దిరాజుకు అజయ్ సన్మానం..

ఈ సందర్భంగా ఎంపీ నామాను, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజును మాజీ మంత్రి అజయ్‌కుమార్ శాలువాతో సత్కరించారు. అలాగే, వద్దిరాజు రవిచంద్ర మరోసారి రాజ్యసభకు ఎన్నికైనందుకుగాను ఎంపీ నామాతో కలిసి ఆయనకు మిఠాయి తినిపించి విషెస్ చెప్పారు.

రారండోయ్.. రామయ్య పెళ్లికి..

- నేడు భద్రాచలంలో సీతారాముల కల్యాణం
- పెళ్లి వేడుకకు ముస్తాబైన మిథిలా స్టేడియం
- రామయ్య చెంతకు తరలివస్తున్న భక్తజనం
- రాష్ట్ర ప్రభుత్వం తరఫున తలంబ్రాలు తీసుకొచ్చిన సీఎస్ శాంతికుమారి
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

ఎదుర్కోలు ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

స్వామివారికి ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాద్రి కొత్తగూడెం, (నమస్తే తెలంగాణ)/ భద్రాచలం, ఏప్రిల్ 16 : సరికొత్త రంగులు అద్దుకొని.. విద్యుద్దీప కాంతులతో మురిసిపోతున్న భద్రాద్రి పుణ్యక్షేత్రం సీతారాముల కల్యాణానికి రా.. రామ్మంటూ భక్తుజనులకు ఆహ్వానం పలుకుతోంది. బుధవారం ఉదయం సీతారాముల కల్యాణం జరిగే వేదిక మిథిలా ప్రాంగణం సర్వ హంగులు అద్దుకున్నది. రామయ్య పెళ్లికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలను సీఎస్ శాంతికుమారి రాష్ట్ర ప్రభుత్వం తరఫున సమర్పించేందుకు మంగళవారం భద్రాచలం చేరుకున్నారు. గత వారం రోజుల నుంచి కలెక్టర్ ప్రియాంక ఆల భద్రాచలంలో మకాం వేసి పెళ్లి ఏర్పాట్లను, భక్తుల కోసం కల్పించే సౌకర్యాలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు రామయ్య పెళ్లి పనులకు సంబంధించిన కార్యక్రమాలను చకచకా పూర్తి చేయించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా.. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఎస్పీ రోహిత్ రాజు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. భద్రాచలంలో ఎటు చూసినా సీతారాముల కల్యాణ శోభ కనిపిస్తోంది. రాములోరి కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు ఈసారి భారీగా తరలిరానున్న నేపథ్యంలో అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేశారు. భక్తులకు సరిపోయే విధంగా లడ్డూలు, తలంబ్రాలను భారీగా సిద్ధం చేశారు.

అమృత ఘడియల కోసం...

బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి రామయ్య పెళ్లి తంతును చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భద్రాచలం తరలివస్తున్నారు. పెళ్లి తర్వాత రామయ్య పట్టాభిషేకం ఘట్టాన్ని కూడా కనులారా తిలకించేందుకు ఆసక్తి చూపుతున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ, రైల్వే శాఖలు ప్రత్యేక రవాణా ఏర్పాట్లు చేశాయి. ఆంధ్రా, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు ఇప్పటికే భద్రాచలం చేరుకున్నారు.

సీఎం, మంత్రులకు ఎన్నికల కోడ్ అడ్డంకి..

ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో శ్రీరామ నవమికి ప్రజాప్రతినిధులు హాజరుకావడం లేదు. ప్రభుత్వం తరఫున సీఎస్ శాంతికుమారి హాజరై స్వామివారి కల్యాణానికి తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పిస్తారు. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ ప్రియాంక ఆల భద్రాచలంలో ఇతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వీఐపీ, వీవీఐపీ గ్యాలరీల్లో కేవలం అధికారులు, భక్తులు మాత్రమే కల్యాణాన్ని తిలకించనున్నారు. అన్ని సెక్టార్లలో తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు, కూలర్లు ఏర్పాటు చేశారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని వీక్షించడానికి ఎల్ఈడీ స్క్రీన్‌లను అమర్చారు.

పర్ణశాలలో రామయ్య కల్యాణం

భద్రాద్రి రామయ్య కల్యాణంతోపాటు రామయ్య నడయాడిన పుణ్యభూమి పర్ణశాలలో సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించనున్నారు. ఇందుకోసం దేవాదాయ శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. అలాగే భద్రాద్రి జిల్లాలోని అన్ని మండలాల్లో రామయ్య కల్యాణం వైభవోపేతంగా నిర్వహించనున్నారు.

నేత్రపర్వం.. ఎదుర్కోలు ఉత్సవం
భద్రాద్రిలో తరించిన భక్తజనం

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి 'ఎదుర్కోలు' ఉత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను రామాలయం నుంచి ఉత్తరద్వారం వద్దకు తీసుకొచ్చారు. వైకుంఠద్వారం వద్ద శ్రీరామచంద్రమూర్తిని, ఆయనకు అభిముఖంగా సీతమ్మను ఉంచారు. రామయ్య వైపు ఉప ప్రధానార్చకుడు కోటి శ్రీమన్నారాయణాచార్యులు, సీతమ్మ వైపు ఆస్థాన స్థానాచార్యులు కేతః స్థలశాయి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. అయోధ్య నుంచి రామచంద్రమూర్తి, మిథిలా నగరం నుంచి సీతమ్మ తల్లి వచ్చారని వారి గుణగణాలు, వంశ గౌరవం, ప్రతిభ, శౌర్యాన్ని వివరించారు. రామయ్య గరుత్మంతుడి వాహనంపై ఎందుకు వచ్చారని కేతః స్థలశాయి ప్రశ్నించగా, త్వరితగతిన రావాలనే కోరికతో గరుత్మంతుడి వాహనంపై రామయ్య తండ్రి వచ్చారని శ్రీమన్నారాయణాచార్యులు బదులు ఇచ్చారు. సీతారాముల కల్యాణాన్ని వీక్షిస్తే ఆ ఇంట సకల శుభాలు కలుగుతాయని వివరించారు. సీతమ్మ, రామయ్య గుణగణాలను వర్ణించిన తర్వాత మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ వాయిద్యాలకు అనుగుణంగా అర్చకులు మాలా పరివర్తన కార్యక్రమాన్ని నేత్రపర్వంగా జరిపారు. మాలా పరివర్తన కార్యక్రమంలో అర్చకులు చేసిన నృత్య రీతులు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం రామయ్య పక్కన సీతమ్మ తల్లిని ఉంచి ప్రత్యేక హారతులు సమర్పించారు. ఎలక్షన్ కోడ్ కారణంగా దేవాదాయశాఖ మంత్రి, జిల్లాకు చెందిన మంత్రులు ఎవరూ రాలేదు. అయితే ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలను సీఎస్ శాంతికుమారి దంపతులు, దేవాదాయ కమిషనర్ హనుమంతరావు సమర్పించారు. ఆ తదుపరి సీతారాములకు తాతగుడి సెంటర్ వరకు తిరువీధి సేవ జరిపారు. కార్యక్రమంలో సీఎస్ శాంతికు మారి దంపతులు, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ రోహిత్ రాజు, ఈవో రమాదేవి పాల్గొన్నారు.

పర్ణశాలలో వైభవంగా ఎదుర్కోలు

పర్ణశాల, ఏప్రిల్ 16 : సీతారాముల కల్యాణ మహోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి పర్ణశాల రామాలయంలో స్వామివారికి ఎదుర్కోలు కార్యక్రమం వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలో స్వామివారికి తిరువీధి సేవ చేపట్టారు. కార్యక్రమంలో అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ఎదుర్కోలు నిర్వహిస్తున్న అర్చకులు

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం..

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా, ఎమ్మెల్సీ తాతా మధు

కార్యకర్తలను పరామర్శించి బయటకు వస్తున్న నామా, తాతా మధు, నాయకులు

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 16 : బీఆర్ఎస్ పార్టీకి ఉద్యమాలు, కేసులు కొత్తేమీ కాదని, ఈ విషయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని, వారికి అండగా మేమున్నామని ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు భరోసా ఇచ్చారు. పండితాపురంలో ఇటీవల జరిగిన కేసులో జిల్లా జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న దనేకుల హనుమంతరావు, దనేకుల మాధవరావు, చల్లా హరి, చల్లా నాగేంద్ర బాబు, చల్లా నరేశ్‌లను ములాఖత్ ద్వారా మంగళవారం వారు పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ నాడు స్వరాష్ట్రం కోసం.. నేడు తెచ్చిన తెలంగాణను కాపాడుకోవడం కోసం ఉద్యమాలు చేయక తప్పదన్నారు. ఏ కార్యకర్తకు ఇబ్బంది కలిగినా చూస్తూ ఊరుకోమని, వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బానోత్ హరిప్రియానాయక్‌తోపాటు పలువురు నాయకులు ఉన్నారు.

సివిల్స్ ఫలితాల్లో ఐపీఎస్ సాధించిన సాయి అలేఖ్య

తల్లిదండ్రులతో రావూరి సాయి అలేఖ్య

బోనకల్లు, ఏప్రిల్ 16 : యూపీఎస్సీ ఫలితాల్లో ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం గోవిందాపురం-ఎల్ గ్రామానికి చెందిన రావూరి సాయి అలేఖ్య ఆలిండియా స్థాయిలో 938వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికైంది. సివిల్స్‌కు ఎంపికైన అలేఖ్య తండ్రి మధిర టౌన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కాగా.. ఐపీఎస్‌కు ఎంపికైన సాయి అలేఖ్యకు ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు.

నాన్న కోరికను నెరవేర్చా : సాయి అలేఖ్య

చిన్ననాటి నుంచి బాగా చదివి ఐఏఎస్, ఐపీఎస్ కావాలని మా నాన్న చెబుతుండేవారు. పేపర్ కటింగ్‌లు నాకు తీసుకొచ్చి ఇచ్చి చదువుకోమని చెప్పేవారు. వాటిని చదివి నేను కూడా సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలని అనుకునే దానిని. ఇంటర్ పూర్తయిన తర్వాత బీటెక్ వైపు వెళ్లకుండా డిగ్రీ చదివాను. ఎంఏలో రూరల్ డెవలప్‌మెంట్ బెనారస్ ఇందు యూనివర్సిటీలో పూర్తి చేశాను. సివిల్స్ ప్రయత్నం చేశాను. నాన్న కోరికను నేను సాధించడం ఎంతో ఆనందం కలిగించింది. మా అమ్మ ఎప్పటికప్పుడు బాధ్యతలు గుర్తు చేస్తూ తన వెన్నంటే ఉంటూ ధైర్యాన్నిచ్చింది.

సీఎస్‌కు స్వాగతం పలికిన కమిషనర్, కలెక్టర్

ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న సీఎస్ శాంతికుమారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

సారపాక/భద్రాచలం, ఏప్రిల్ 16 : భద్రాచలంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారామచంద్రస్వామి కల్యాణంలో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం మధ్యాహ్నం సారపాకలోని ఐటీసీ అతిథి గృహానికి చేరుకున్నారు. అంతకుముందు ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ఖమ్మం జిల్లా సరిహద్దులో సీఎస్‌కు ఘన స్వాగతం పలికి పూల మొక్కను అందజేశారు. అతిథి గృహానికి చేరుకున్న సీఎస్ శాంతికుమారికి సమాచార, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ రోహిత్ రాజు స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం సీఎస్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉండడంతో ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను బుధవారం ఆమె స్వామివారికి సమర్పించనున్నారు.

రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ

- ఐడీవోసీలో ఏర్పాట్లు సిద్ధం
- ఎన్నికలు ముగిసే వరకు సాధారణ ప్రజలు కలెక్టరేట్‌కు రావద్దు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్

మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

ఖమ్మం, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 18వ తేదీ గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణకు ఐడీవోసీలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. 21వ తేదీన ఆదివారం మినహాయించి, మిగతా 7రోజులు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థికి సంబంధించి 3 వాహనాలను మాత్రమే అనుమతి ఉందని, మిగతా వాహనాలు 100 మీటర్ల దూరంలో ఉండాలని సూచించారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో నామినేషన్లు స్వీకరించనున్నట్లు, రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో ఒకేసారి ఐదుగురికి మాత్రమే అనుమతి ఉందని తెలిపారు. 26వ తేదీ స్క్రూటినీ ప్రక్రియ ఉంటుందని, 29వ తేదీన మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణకు గడువు ఉందన్నారు. ఈ నెల 17న వ్యయ పరిశీలకులు, 23న సాధారణ, పోలీస్ పరిశీలకులు జిల్లాకు రానున్నట్లు తెలిపారు. ఎన్నికలు ముగిసే వరకు సాధారణ ప్రజలు కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు. పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్రియాశీలకంగా పని చేస్తున్నాయని తెలిపారు. ఎస్ఎస్టీ టీములు 18వ తేదీ నుంచి పని చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్, మిర్నల్ శ్రేష్ఠ, జిల్లా పౌరసంబంధాల అధికారి ఎంఏ గౌస్, జిల్లా ఉపాధికల్పన అధికారి కె.శ్రీరామ్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, మదన్‌గోపాల్, అధికారులు పాల్గొన్నారు.

రైతు ఆదాయం రెట్టింపునకు ప్రత్యేక ప్రణాళిక

- సాగు విస్తరణకు అనుగుణంగా ఫ్యాక్టరీల నిర్మాణం
- ఉద్యానశాఖలో త్వరలో 19 పోస్టులు భర్తీ
- ఆయిల్‌ఫెడ్ ఎండీ, ఉద్యానశాఖ డైరెక్టర్ అశోక్‌రెడ్డి

ఫ్యాక్టరీలో గెలలను పరిశీలిస్తున్న ఆయిల్‌ఫెడ్ ఎండీ, ఉద్యానశాఖ డైరెక్టర్ కె.అశోక్‌రెడ్డి

అశ్వారావుపేట, ఏప్రిల్ 16 : ఉద్యాన రైతుల ఆదాయం మూడింతలు పెంచే లక్ష్యంతో ప్రత్యేక ప్రణాళిక అమలు చేయనున్నట్లు ఆయిల్‌ఫెడ్ ఎండీ, ఉద్యానశాఖ డైరెక్టర్ కె.అశోక్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అశ్వరావుపేట మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన స్థానిక పామాయిల్ ఫ్యాక్టరీలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయిల్‌పాం సాగు ప్రాజెక్టు విజయవంతంగా సాగుతున్నట్లు తెలిపారు. ఆయిల్‌పాం రైతుల అభివృద్ధి, సంక్షేమం, అనుబంధ రంగాల పురోగతికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో వ్యవసాయం పట్ల రైతులతోపాటు ఉద్యోగులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని, అందుకే వ్యవసాయ భూముల ధరలు భారీగా పెరిగాయని చెప్పారు. పెరుగుతున్న సాగు విస్తరణకు అనుగుణంగా ఫ్యాక్టరీల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన సౌకర్యాలు లేకనే రైతు కుటుంబాలు పట్టణాలకు వలస వెళ్తున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని పల్లెల్లోనూ ఉద్యాన సాగుకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరికరాలను అందుబాటులో ఉంచడానికి దృష్టి సారిస్తున్నామని చెప్పారు. త్వరలో ఉద్యానశాఖలో 19 పోస్టులను భర్తీ చేయనున్నామని, దీని ద్వారా ఉద్యోగుల కొరత కూడా తీరుతుందని చెప్పారు. మండలంలో విస్తృతంగా పర్యటించిన ఎండీ అశోక్‌రెడ్డి పామాయిల్ మొక్కల పెంపకం, ఫ్యాక్టరీలో గెలల క్రసింగ్, ఆయిల్ రివకరీ, ఉప ఉత్పత్తులు, కొత్త ఫ్యాక్టరీ నిర్మాణాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు. ఆయిల్‌పాం రైతు సమస్యలపై అశ్వారావుపేట జోన్ ఆయిల్‌పాం గ్రోవర్స్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.మహేశ్వర్‌రెడ్డి, కె.పుల్లయ్య వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ టి.సుధాకర్‌రెడ్డి, పీఅండ్‌పీ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉద్యానాధికారులు రమణ, సూర్యనారాయణ, ఖమ్మం ఆయిల్‌ఫెడ్ మేనేజర్ భారతి, డివిజనల్ ఆఫీసర్ ఆకుల బాలకృష్ణ, రైతులు ఆలపాటి రామచంద్రప్రసాద్, వెంపాటి లక్ష్మీనారాయణ, నాగబాబు, కేవీ సత్యనారాయణ, జగన్, ప్రసాద్ ఉన్నారు.

నాణ్యమైన గెలలను తీసుకురావాలి

దమ్మపేట, ఏప్రిల్ 16 : పూర్తిగా పక్వానికి వచ్చిన పామాయిల్ పండ్ల గెలలను ఫ్యాక్టరీకి తీసుకొచ్చి అత్యధిక ఓఈఆర్ పొందాలని టీఎస్ ఆయిల్‌ఫెడ్ ఎండీ అశోక్‌రెడ్డి రైతులకు సూచించారు. అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని మంగళవారం సందర్శించారు. పక్వానికి వచ్చిన గెలల బరువు సైతం పచ్చి గెలల కంటే అధికంగా వస్తుందని రైతులకు అవగాహన కల్పించాలని ఆయిల్‌ఫెడ్ అధికారులకు సూచించారు.